కథానిక

# గాలిలో దీపం

## శ్రీ యస్. ఆర్. నంది

ఒంటరిగా కూచుంటే తనకి వేదాంతం పుట్టుకొస్తుంది: తన వెనుకవున్న లోకమంతా మనోరంగంలో కుదించబడ్డట్టు చిన్నగా సన్నగా ఆడుతూ అగుపిస్తూవుంటే, ఈ సృష్టిలో నిజానికి ఏ విషయమూ గొప్పగా కనిపించటంలేదు! ఇవన్నీ తనముందు మోకరిల్లినట్టు వూహించుకొంటె ద్రష్టగా తను ఎంత గొప్పవాడు;

ఇసుక తిన్నెలలో పరాచికాలాడుతున్న తరంగాలు, ఒడ్డమ్మటే చీరఅంచులు తడిసేటట్టు మెల్లగా నడచే భామలు, గుంపులుగా కూడి బాతాఖానీ కొడుతున్న మనుషులు—ఆ భవంతులు, ఈ రేడియోలు, సంగీతాలు—ఆ కార్లు, రిక్షాలు, సైకిళ్లు—అన్నీ ఓ లీలగా, అలా అలా నీడల్లా కళ్లముందు కదులుతూ వుంటే వాసుకి లోకమంతా వేదాంతంగానే అనిపిస్తుంది మరి!

"ఏమిట్రా వాసూ, తెగ ఆలోచించేస్తున్నావ్, కెరటాలగురించా సంగీతంగురించా?"

అల్లంత దూరంనించి అరుచుకొంటూ వచ్చి పక్కన చతికిలబడ్డాడు రామారావు.

ఊహల్లో వేదాంతం కరగిపోయింది! ఒక గాఢమైన నిట్టూర్పు వచ్చింది వాసునించి!

"కాదు...జీవితంగురించి" అన్నాడు, విడచిన నిట్టూర్పుల్లో ఈ మాటల్ని మిళితం చేస్తూ, మెల్లగా.

రాము నవ్వాడు యింతగా!

"భేష్! ఇప్పటికి పాతికేళ్ళనించి ఆలోచించిన ఆలోచనంతా ఒకపక్కకి నెట్టి యికనించయినా జీవించడం నేర్చుకోరా నాయనా—జీవించడం."

"అదేరా రాము, ఎలా నేర్చుకోవాలీ అని ఆలోచిస్తూ వున్నాను."

"నేర్చుకోడానికి ఆలోచించడమేమిట్రా పిచ్చీ! ఈ కాలంలో బ్రతకదలచినవాడెప్పుడూ జీవితంగురించి ఆలోచించకూడదు. మాట వరసకు: నన్ను చూడు: నేనీ రెండు కళ్ళతో లోకాన్ని చూస్తాను; చూసిన ఆ లోకంనించే ఈ రెండు చేతులతో సంపాయించుకొంటాను."

"అది కొందరి అదృష్టంరా"

"ముసలమ్మలా మాటాడకు; నువ్వుమాత్రం నెలకింత సంపాయించుకోవటం లేదు?"

"కాని ఏం లాభం?"

"ఏం లాభమేమిట్రా? నీకు మైనారిటీ తీరిపోయింది, యిప్పుడు నువ్వు స్వతంత్రించి మీ బాబాయ్ యింట్లోంచి వేరైపోతే—"

రాము మాటలు యింకా నోట్లో వుండగానే వాసుకి నరనరాల్లో భయం బయలుదేరింది. నోరావలించి—

"విడిపోవడమే?!" అన్నాడు ఒక్కసారిగా.

"ఆఁ ఏం?"

"అది నాకు చాతకాదు" అన్నాడు తల అడ్డంగా తిప్పుతూ.

"అవును నీకు బాధపడటం యిష్టం; ఆ బాధని చూసి ఎదటివాడు మరొకడెవడైనా ఓదార్చ రావాలని నీ కోర్కె"

"అదికాదు రాము..."

"అవునవును—అది, పిన్నిగారిల్లు విడిచిపెడితే బ్రతగ్గలనా అనే భయంలే."

"నామాట సరిగావిను రాము, ఇంతవరకు నేను లోకంలో ఒంటరిగా తిరగలేదు. మా అమ్మా నాన్నా పోయిన దగ్గరనించీ నేను ఒకళ్ల దయాధర్మాలమీద ఆధారపడవలసి వచ్చింది. అది ఎలాంటి విచిత్ర వాతావరణమంటే..."

* * *

అవును నిజమే! వాసు చాల విచిత్రవాతావరణంలో పెరిగాడు. మారాం చేస్తూ మాటాడే అదృష్టం చిన్నతనంలో లేకపోయింది; తనని ఎత్తుకొని ముద్దాడి గారాబం చేసే అమ్మా నాన్నా కనిపించలేదు. బదులుగా భయం; ఒకళ్ళ చూపుకింద మెలగవలసి వచ్చిందనే భావం అతనిలో గాఢంగా నాటుకొని పోయి బాల్యంనుంచీ జీవితమంటె అతనికి పవిత్రాశయం లేకుండా చేసింది.

తెల్లవారదింకా—తొలికోడి కూసి కాస్త కునుకు తీస్తుంది; కాని పిన్నిమాత్రం—

"అయ్యోరాతా! మలికోడి కూసినా ముసుగెట్టుక మూలుగుతున్నా డేవిటమ్మా!" అని అరచేది.

ముసుగులోనించి త్రుళ్లిపడి లేచి కూచునేవాడు వాసు: "లేచాను పిన్నీ" అంటూ.

"ఉద్ధరించావురా నాయనా! త్వరగా వెళ్ళి పాల మనిషిని కేకేసుకరా...ఆ చప్పున తిరిగిరా—అక్కడే కాపరం పెట్టక—వచ్చి బజారు కెళ్లాలి"

ప్రతీ ఆజ్ఞకీ, ప్రతీ ప్రశ్నార్థకానికీ కారణం అడిగే వయస్సది—అప్రయత్నంగా అడిగేసేవాడు:

"ఎందుకు పిన్నీ?"

"అడిగావూ—అయితే యిహ నా బజారు తగలడ్డట్టే."

"అది కాదు పిన్నీ...నోట్సు...రాసుకోవాలని"

"నోట్సులా! రాసుకో నాయనా రాసుకో—ఆ బజారేదో నేనే చూసుకొంటాను; పాల మనిషినీ నేనే పిలుచుకొంటాను—"

ఈ గ్రామఫోను మోత విని బాబాయ్ పక్కమీదినించి వళ్లు విరుచుకొంటూ లేచివచ్చేవాడు:

"ఏవిఁటే తెల్లారకముందే అలా అరుస్తున్నావ్?"

"మీ అబ్బాయిని కాస్త బజారు కెళ్లిరమ్మంటే నోట్సులు రాసుకోవాలంటున్నాడు."

"అవున్రా?"

"ఫర్వాలేదు బాబాయ్; అవి తీసుకొచ్చాకే రాసుకొంటాను."

కాళ్ళీడ్చుకొంటూ వెళ్ళేవాడు, లోలోన విసుక్కొంటూ, తిట్టుకొంటూ. మరీ చిరాకేసినపుడు వాళ్ళిద్దరు యములాళ్ళనీ ఏదో చేసేద్దామన్నంతగా వూహించుకొని, ఉద్వేగంతో చమట కక్కుకొనేవాడు; చేతగాక చివరికి ఏడ్చుకొనేవాడు.

ముఖం కడుక్కునే దగ్గరా, స్నానంచేసే దగ్గరా, తువాలు పెట్లోనించి తీసుకొనేదగ్గరా, స్కూలుకి టైమయి అన్నం త్వరగా పెట్టమనే దగ్గరా, బట్టలు వేసుకొనేదగ్గరా, తనుచేసే ప్రతీ పని దగ్గరా వాసుకి ఎవరివల్లో ఎందుకో భయం పుట్టుకొచ్చేది; వాళ్లు తను చేసే ప్రతీ పనిదగ్గరా విసుక్కుంటారని అనుకొనేవాడు—కాని ఏ వ్యక్తివల్ల తను పరోక్షంగాగూడా భయపడుతున్నాడో, ఆ వ్యక్తి నిజానికి వాసుని కావాలని పనిపట్టుక ఏడిపించే మనిషిమాత్రం కాదు.

తారీఖులు, క్యాలండర్లు తిరుగుతున్నాయి.

వెనక్కి వెక్కిరిస్తూ వెళ్ళిపోతున్న ప్రతీ క్షణమూ వాసు మస్తిష్కంలో ఒక శూలాన్ని విడిచిపెట్టిపోయేది. పరభాగ్యోపజీవిగా తను తిరుగుతున్న యింట్లో ప్రతీ మాటా, ప్రతీ సంఘటనా అతనిలో ఒక్కొక్క రకమైన నైరాశ్యాన్ని కలిగించి కరగిపోయేవి. ఒక్కుమ్మడిగా పరిసరాలు తనమీద చేసే దాడికి, వాసు మానసికంగా ఎంత అట్టడుగుకి క్రుంగిపోవాలో అంతగానూ క్రుంగిపోయాడు. ఆ స్థితిలో అతనికి అక్కడ గాఢస్నేహితులుగా, ఆంతరంగిక మిత్రులుగా, లోకం తన నిత్యజీవితంలో బహిష్కరించిన వాదాలు, పథాలుగా ఏర్పడ్డాయి.

స్కూలునించి యింటికి తిరిగి వచ్చేసరికి పిన్ని చిరాకు మాటలు వినిపించేవి.

"ఈ పాడుకొంపలో ఒకదిక్కా మొక్కా! కాస్తంత యిక్కడ అడుగుతీసి అక్కడ పెట్టడం చేతకాదు: ఓ, యిహ మాటలు చూస్తే కోటలు దాటతై! ఇంటెడు పనీ నేనే చూసుకోవాలి—ఎవరికి కలిసొచ్చిన సంతని వీళ్లందరికీ వేళకి వండి కుమ్మరించటం."

పిన్ని జన్మతః చిరచిఱ్లాడే మనిషి కాదు. అయినా ఇంటిపనంతా తను ఒంటరిగా చేసుకోవలసి వచ్చేసరికి తనలో బద్ధకం కోపంరూపంలో బయటపడేది. అది చల్లారే మార్గం కనిపించక తనలో వుండే బలహీనతలన్నిటినీ శపించుకొంటూ తనని తానే పల్లార్చుకునేది!

ఆ స్థితిలో బాబాయ్ ఎదురై ఏమాట అనడానికి ప్రయత్నించినా, ఆవిడ ఆగ్రహమంతా వాసు మీదికి తిరిగిపోయేది—

"అవును—కష్టమేసి ఒక్కమాట అనుకోడానికి వీల్లేదు. అన్నానా నాలుగు వేపుల్నించీ నలుగురూ నామీదే పడతారు"

"ఆ పడేదెవరే—వాసుమీదేనా నీ చిరాకంతా?"

"చిరాకు కాదు, ముద్దు. పొద్దుటనగా పోయాడు—యింతవరకు యింటిపట్టు పట్టకపోతే కొంపలో పనంతా ఎవరు చూసుకొంటారూ అని"

"అరె, స్కూలు విడిచిపెట్టాలంటావా?"

"బాగుంది! ఏనాటి స్కూలు యెక్కడిలోకం! పక్కింటి కిష్టుకు ఎప్పుడనగా వచ్చేశాడు"

"వీడూ వస్తుంటాడు—కంగారెందుకు? సరె, ఏదీ ఆ పని నాకు చెప్పు"

"అక్కడికి నేనే యెంతో యిదైనట్టు" ఆవిడ కళ్ళనించి నీళ్లు ఝల్లున రాలేవి! "ఇంతకీ పరాయి దాన్ని గాబట్టి ఆమాట అనేశాడు. ఆ అబ్బాయి గూడా నేను సరిగ్గా చూడనని వూరూ వాడా చాటుక తిరగడం, యిక్కడ మగమనిషీ యిలా నే అని—"

"మాటకి ముందు ఏడుపు! నీమీద వాడు చాటుక తిరుగుతున్నాడా?"

"అబ్బే! పొగుడుతున్నాడు. మొన్నటికి మొన్న లక్ష్మమ్మగారితో ఆ అబ్బాయి 'పొట్టకింత సరైన తిండైనా పెట్ట'నని మొరెట్టుకొన్నాడట! అయినా ఇంతకీ యింట్లో వాళ్ళే నమ్మనపుడు బయట వాళ్లు నమ్మకపోవడంలో వింతలేదులెండి"

"సరే వాణ్ణిరానియ్"

బయటనించి నిలువెల్లా కంపించిపోతూ ఈ సంభాషణంతా వింటున్న వాసు దప్పున వచ్చే వాడు.

"నేనలా అనలేదు బాబాయ్" అనేవాడు మాటలు మింగేస్తూ.

"మరేమన్నావ్?"

"లక్ష్మమ్మగారే మొదట అడిగారు బాబాయ్: 'మీ పిన్ని నీకు రాత్రిళ్ళు తాగడానికి పాలిస్తుందిరా అని. నేను లేదన్నాను"

"విన్నారా, విన్నారా! మీ యెదురుగా నే ఎన్నిసార్లు ఈ పిల్లాడికి గ్లాసుతో గ్లాసుడు పాలు యిచ్చేదాన్ని!"

బాబాయ్‌కి ఏం చెప్పడానికీ తోచేది కాదు. ఇటూ అటూ వూగులాడే మనస్సు ఏదీ నిర్ణయించకం డానే తాత్కాలికోద్రేకానికి లొంగి వాసుని చెళ్లున కొట్టేవాడు.

వాసు స్కూల్ ఫైనల్ లోకి వచ్చాడు.

అయినా మారిన అతని గొంతుకలో వణకు పోలేదు; యవ్వనం వచ్చినా శరీరంలో కంపం తగ్గ లేదు; గుండెల్లో భయం పోలేదు; మాటల్లో తడుము కోవడం తగ్గలేదు.

పరీక్షలు దగ్గరపడేకొద్దీ భయం హెచ్చవ జొచ్చింది. పర్యవసానంగా పిరికి పట్టుదల కూడా వృద్ధయింది—ఎలాగయినా పరీక్ష పాసవాలని. గోల్డ్ స్మిత్ 'విలేజ్ స్కూల్ మాష్టరు' పద్యంతో పగలూ రాత్రి కుస్తీపట్టడం మొదలెట్టాడు—ఎవరో పరీక్షలో వస్తుందంటె. ఈ కాకిగోల పిన్నికి మహా చిరాకును కలిగించింది.

"ఈ యేడాదైనా అబ్బాయి గట్టెక్కే యోగ మేమన్నా వుందా?" అంది, పడకకుర్చీలో పడు కొన్న బాబాయికి ఆకులు అందిస్తూ.

"ఉండడమేమిటి? వాడు పుట్టగానే ప్రతి క్లాసుకీ మూడేళ్లు కంట్రాక్టు రాయించుకొని మరీ పుడితేను!"

"అయినా కీడెంచి మేలెంచడం మంచిది : ఈ ఏడాదీ పోతే మళ్ళీ చదివిస్తారా?"

ఇంతెత్తున లేచాడు బాబాయ్!

"ఉహూం! ఇంకా చదివించడమే! ఇప్పటికే నా సంపాదనలో సగం నాశనమైతే!"

"అవును, స్వయంకృతాపరాధం మరి!"

వాసులో సగం భాగం మాత్రమే చదువుతున్న పుస్తకం మీద కేంద్రీకరించి వుంది. తనలో కొంత భాగాన్ని ఎంత ప్రయత్నించినా వాళ్ళు మాటాడు కొంటున్న మాటలమీదికి పోనివ్వకుండా చేయలేక పోతున్నాడు. కంఠం మాత్రం తనపని తాను చేసు కొంటోంది.

"ఏమిటండీ ఆ యింగ్లీషు మంత్రాలు అలా గొంతుక చించుకొంటూ చదువుతున్నాడు!" అంది పిన్ని.

బాబాయ్ సగం నిద్రలో సమాధానం చెప్పాడు 'పరీక్షల్లో వస్తాయని'.

వాసు స్వరం మరింత హెచ్చింది.

"ఆ పరీక్షల మాట దేవుడెరుగుగాని ఆ గోలకి నా తల పడిపోతోంది...బాబూ!...అబ్బాయ్!..."

"పిలిచావా పిన్నీ?"

"అవును నాయనా...ఆ దండకాన్ని కాస్త లోపల స్మరించుకొందూ నీకు పుణ్యముంటుంది"

వాసు స్వరం తగ్గించి మెల్లగా చదువుకోవడం మొదలుపెట్టాడు. కాని అలవాటు ప్రకారం స్వరం హెచ్చిపోతుంది. పిన్ని చిరాకు పడింది. విసు క్కుంది. లాభంలేక పుస్తకం మూసి, కళ్ళు మూశాడు.

పరీక్షా ఫలితాలు తెలిశాయి. వాసు నంబరు లేదు. అలా కృంగిపోయాడు. కళ్ళమ్మట నీళ్ళు తిరి గాయి.

ఈకాలంలో చదువుకీ జీవితానికీ వున్న సంబంధం వాసుకి తెలీదు; ఉద్యోగం చేసుకో

డానికీ, పొట్టనింపుకోడానికీ గల అజ్ఞాతబాంధవ్యం గూడా తెలీదు, వాడికి తెలిసిందల్లా ఒక్కటే పరీక్ష పాసయితే బాబాయ్ తిట్లు తప్పతాయనేది.

ఇంటికి వెళ్లడానికి ధైర్యం చాల్లేదు; ఎక్కడికన్నా పారిపోవాలనుకొన్నాడు. కాని ఎక్కడికి పోవాలి? తనని ఎదుర్కొన్న మొదటిప్రశ్న తిండి. ఆకలికి తట్టుకోగల ప్రాణం కాదు తనది. ఎన్ని మాటి విరుపులతోనైనా, ఎన్ని అరుపులతోనైనా వేళకింత అడుగు మెతుకులు ఆకలిని చంపేస్తే తనకి అదే పది వేలు. భయపడ్డాడు తన ఆలోచనకి. తనకి తెలీకండానే యింటికి వచ్చేశాడు! వాకిట్లోనే ఎదురైన బాబాయ్ బెబ్బులిలా అరచాడు.

"ఏమయిందిరా?"

ఒక్కసారిగా వంట్లో రక్తమంతా పాదాల్లోకి పరుగులు తీసింది; గుండె క్షణం ఆగి తీవ్రంగా కొట్టుకో మొదలుపెట్టింది. కళ్లముందు చుక్కలు కనిపించాయి.

"న...నం...బ...రు...లేదు..."

లోపలినించి పిన్ని సుడిగాలిలా వచ్చింది.

"నాకు తెలుసు: ఉండే మనుషుల తీరే వేరు... నువ్వెక్కడ రాజావిబాబు; నిన్నొకమాట అనడానికి మా కిప్పుడు హక్కుందా!"

పిన్నిమాటలు వాసు లెఖ్ఖ చెయ్యలేదు. పటాపంచలైన ధైర్యాన్నంతనీ కంఠంలోకి కేంద్రీకరించుకొని మెల్లగా అన్నాడు:

"ఇంగ్లీషులో పోయుంటుంది బాబాయ్... అదొక్కటీ కంప్లీట్..."

ఆమాటలు పూర్తికాకండానే బాబాయ్ తోక తొక్కిన తాచులా లేచాడు.

"ఉద్ధరించావు! ఇంతవరకు యిన్ని కంప్లీటు చేశావ్ — యిహ యిదొక్కటి మిగిలిపోయింది! ఇహ నువ్వు కంప్లీట్ చెయ్యొవద్దు, నా యింట్లో వుండనూవద్దు. రేపొద్దుటకల్లా నా యింట్లో క్షణం వుండేటందుకు వీల్లేదు"

వాసు తలొంచుకొన్నాడు.

"ఏం మాటాడవ్?"

పిన్ని అడ్డుకొంది:

"ఏం మాటాడతాడు? ఇంతవరకు ఏదో భరించాం; ఇప్పుడు యింటోంచి తగిలేస్తే యిన్నాళ్ల మన పెంపకం, యింత పేరూ బూడిదపాలవుతుంది. లోకులకేం తెలుసు చెప్పండి? చప్పున ఓమాట అనేస్తారు—ఇహ దాన్నించి మనం శాశ్వతకాలం తప్పించుకోలేం" అని ఆయనదగ్గరగా వచ్చి:

"ఆఁ...మీ ఆఫీసులో ఏవో వుద్యోగాలున్నాయన్నారుగా?" అంది.

"స్కూలుఫైనలు రెండేళ్ళు డింకీకొట్టిన దద్దమ్మలకి దొరికే ఉద్యోగాలు కావవి"

"పోనీ ఏదో ఒకటి: పదిరూపాయలే చాలు ఆ అబ్బాయి కడుపు కింత స్వతంత్రంగా తెచ్చుకొంటె; ఆ తర్వాత తన దారేదో తానే చూసుకొంటాడు."

బాబాయ్ ఏం అనలేకపోయాడు. అక్కణ్ణించి లోపలికి వచ్చేశాడు: "చూసుకొంటాడు! చూసుకోడూ మరి!" అని గొణుక్కొంటూ. ఆ మూలకి వెళ్ళాక చప్పున వెనక్కి తిరిగాడు. వాసు తలొంచుకొని కళ్ళనీళ్ళు తిప్పుకోవడం కనిపించింది. ఆయనకి మరింత మండుకొచ్చింది.

"అలా యేడుస్తూ కూచుంటా వేమిట్రా? అలా సుబ్బరామయ్యగారింటికి వెళ్లి ఒక అప్లికేషన్‌ఫారమ్ ఒకటి తీసుకురా"

"కళ్ళుతుడుచుకొనిఅక్కణ్ణించి కదలిపోయాడు వాసు.

జీవితంలో ఒక అవస్థనించి మరో అవస్థలోకి వాసు ప్రవేశించాడు. తన పాతికేళ్ళ వయస్సులో నేర్చుకోగలిగిన అణకువ, భయం, బిడియం అంతనీ ఆఫీసులో వుపయోగించుకొన్నాడు. వళ్ళు చూసుకోకండా యాంత్రికంగా పనిచేసే గాడిద ఓర్పు తనలో చాల యెక్కువగా వుంది. అయినా అధికారిచేత చీవాట్లు తినని క్షణం, దినం లేదు.

పిన్ని అన్నట్టు ఆ ముష్టి వుద్యోగంలో చేరిన తర్వాత వాసుకి కాస్తంత ధైర్యం చిక్కింది. ఆఫీసు విడిచిపెట్టాక ఓ గంటసేపు విశ్రాంతిగా సముద్రపొడ్డుదగ్గర కూచునేవాడు. ఆ గాలి, ఆ వాతావరణం, ఆ ఘోష, ఆ నీలివర్ణం తనలో చిత్రవిచిత్రాలైన వేదాంతాలని కలిగించేవి.

వాసులో స్వతంత్రేచ్ఛ కొద్దిగా తలెత్తమొదలుపెట్టింది. నెల చివర్లో చేతిలోపడే జీతమంతా పిన్నికి యిచ్చేసేవాడు. కాని ఆనెల రామారావు పెళ్ళికి పాతిక తీసుకొని గుంటూరు వెళ్ళడంవల్ల మరుసటి నెల జీతంలో చాల తక్కువ పైకం అందింది. ఆ వచ్చిన డబ్బునే పిన్నిచేతిలో పెట్టాడు.

పిన్ని కనుబొమలు ముడిచి కంఠస్వరం తమాషాగా మార్చి అడిగింది:

"ఏమిఁటిది?"

"జీతం పిన్నీ... ఈ... నెలది" నసుగుతూ సమాధానం చెప్పాడు.

"తెలుసులే—ఇంత తక్కువేమని?"

"క్రితం నెల ఐదు రోజులు సెలవు తీసుకొన్నాను."

"ఎందుకో!"

"రాము పెళ్ళికి గుంటూరు వెళ్ళాలని నీతో చెప్పే తీసుకొన్నాను కదు పిన్నీ?"

"అంత ఖర్చుతో, జీతంసెలవు లేనపుడు నేను వెళ్ళమని చెప్పలేదే!"

వాసు సమాధానం చెప్పలేక తల వంచుకున్నాడు.

"సరె ఈ జీతం మీ బాబాయికే యిచ్చుకో" చేతిలో కాగితాలు అందించింది.

వాసు నిలువెల్లా కంపించిపోయాడు.

"ఆయనకు తెలియనివ్వకు పిన్నీ—నేనే యెలానో సంపాయించి యిచ్చేస్తాను" అని బతిమాలుకొన్నాడు.

"ఏమో నాకు తెలీదు; ఆయన రేపొద్దుట నీ పద్దుగురించి అడిగితే నేనేం చెప్పను?"

వాసు సమాధానం చెప్పేలోపల చెప్పులచప్పుడు ద్వారందగ్గర వినబడింది. పైకండువా కుర్చీమీద వేసి బొత్తాలు విప్పుకొంటూ బాబాయ్ చాల సౌమ్యంగా అడిగారు:

"ఏమిఁటే ఆ చెప్పే సంగతి?"

"ఆఁ ఏముంది—" పిన్ని ముందుకి వచ్చింది వాసు వెనకనించి "చెప్పకు పిన్నీ" అని బ్రతిమాలుకొంటున్నా.

"అంత భయం నీకెందుకు? నువ్విప్పుడు ఒకళ్ళకి భయపడే దీంట్లో వుంటేగా? నీమటుకి నీవు నెలకింత తెచ్చుకొంటున్నావ్, పూటకూళ్లకు యిచ్చేటట్టు నామీద యింత పడేస్తున్నావ్—"

బాబాయ్ దగ్గరగా వచ్చి అన్నాడు:

"ఏం, ఈనెల గూడా ఎగేసేశాడా?"

పిన్ని హేళనగా సమాధానం చెప్పింది: "ఆఁ- ఒక్క పదిహేనే లేండి."

బాబాయ్ దృష్టి వాసుమీద పడింది.

"అయితే నీ ఉద్దేశ మేమిఁట్రా?"

వాసు మాటాడలేదు.

అతని మౌనం బాబాయికి మహా చిరాకుని కలిగించింది.

"ఏవన్నా అంటె తల వంచుకొంటావ్? ఏ నెల కా నెల ఐదూ పదీ ఎగనామం పెట్టేస్తూంటె యింట్లో కూ డెలా కుదురుతుందని?...సరె నువ్విప్పుడు ఒకాళ్ళ అదుపాజ్ఞల్లో వుండనూలేవు, మేము దండించనూ లేము. నీ దారేదో రేపట్నుంచి నువ్వు చూసుకో."

వాసులో పిరికితనం మళ్ళా తలెత్తింది. ఏదో ఒక సమాధానం చెబితేగాని ఆయన శాంతించనట్టుంది.

"ఆ పదిహేనూ రేపు యిచ్చేస్తా బాబాయ్" అన్నాడు మెల్లగా.

"ఎలా—దొంగతనం చేశా?"

"పత్రికనించి రావచ్చు."

"ఉహూఁ! అయితే అందాకా అవి వచ్చేవరకు యింద యివి నీదగ్గరేవుంచుకో" పిన్ని చేతిలో నోట్లు లాగుకొని ముఖంమీద విసిరేశాడు.

తను నిజంగా పిరికివాడు; భయస్తుడు; తనకి ధైర్యంలేదు; అది ఏర్పడే ఉపాయం తనకి తెలీటంలేదు!

రామారావు సావకాశంగా శ్రద్ధగా వాసు ఆత్మచరిత్ర విన్నాడు. నిజానికి రాముకి లోలోన ఎంతయినా విచారం వేసింది; వీడూ ఓ మనిషేనా అని కోపంగూడా వచ్చింది; చాలసేపటివరకు ఏం సమాధానం చెప్పలేకపోయాడు.

* * * *

"ఇరవైరోజులు గడిచాయి; యింతవరకు పిన్నికి ఆ డబ్బివ్వలేదు" అన్నాడు వాసు వొణికే కంఠంతో.

"పత్రికల్ని నమ్ముకొని ఎవడైనా ఇల్లాంటి వాగ్దానాలు చేస్తార్రా?" అన్నాడు రాము నవ్వి.

"ఏం చెయ్యమంటావ్ మరి? బాబాయి ఎదురుగా మాటాడలేను. ఆ ధైర్యం చిన్నతనంలోనే చచ్చిపోయింది. ఆ పిరికితనం పిరికితనం యిహ నా జీవితమంతా నేనుచేసే ప్రతీ పనిమీదా ప్రభావం చూపిస్తూనేవుంది. అందుకే ఆ యింట్లోనించి బయటకి వస్తే బ్రతిగ్గలనా అనిపిస్తోంది."

రాము తల అడ్డంగా తిప్పాడు. ఓ నిట్టూర్పు విడిచి:

"నిన్నుచూసి జాలిపడాలో జ్వలించాలో అర్థం కావటంలేదురా" అన్నాడు.

"నాకూ అదే అర్థం కావటంలేదు. మనసు కష్టపడ్డపుడు నన్ను చూసి నాకే జాలేస్తుంది నా స్థితికి; కూచొని లోలోనే యేడ్చుకుంటాను; అది కాస్త ఉపశమనంగా వుంటుంది. కాని కోపం మరీ హెచ్చయేసరికి ఆత్మహత్య చేసుకొని నామీద నేనే కసి తీర్చుకోవాలనిపిస్తుంది."

"ఆత్మహత్యే!" అన్నాడు రాము హేళనగా. "అది నీలాంటి పిరికివాళ్లు చేసుకోగల్రరా? దానికెంత గుండె నిబ్బరం కావాలీ, ఎంత మనోదార్ఢ్యం కావాలీ! ఆఁ, ఒకటె మాత్రం నిజం: కష్టం కలిగినపుడు నీలాంటివాళ్లు చచ్చిపోవాలనుకోవడం, చచ్చిపోయినట్టు వూహించుకొని తన ప్రాణంమీద జాలిపడి మరుక్షణంలో తృప్తిపడి, బాధనంతనీ మరచిపోవడం మాత్రం నిజం. అలాంటి పిరికితృప్తే లేకపోతే ఈలోకంలో యిన్ని లక్షలమంది దరిద్రులూ ఏనాడో ఆత్మహత్యలు చేసుకొని వుండేవారు."

తర్వాత వాళ్ళమధ్య చాలసేపటివరకు నిశ్శబ్దత ఆక్రమించింది. ఆక్రమించిన నిశ్శబ్దతలో రేడియో సంగీతం తెరలు తెరలుగా కొట్టుకొనివచ్చి కలసిపోతుంది.

రాము వాసుకిచ్చిన సలహా ఒక్కటే: ధైర్యం చేసి తనదారి తనని చూసుకోమని.

"సరె నేనిహ వెడతా. గృహసీమలో నాకోసం ఎదురు చూసే గృహిణి ఒకతె వుందిగా" దులుపుకొంటూ లేచి వెళ్లిపోయాడు రాము.

వాసు అదోలా నవ్వుకొన్నాడు: తనకోసం గృహసీమలో ఎదురుచూసే గృహిణి ఒకతె వుందనగా నే.

"గృహిణి!" అంటూ గొణుక్కున్నాడు.

ఆ మాట మహామధురంగా ధ్వనించింది. ఉల్లాసంతో లేచిపడే అలల్లో ఒక విలాసిని అగుపించింది. దూరంనించి కొట్టుకొస్తున్న సంగీతంలో ఒక సుభాషిణి కనిపించింది. కళ్ళు మిరుమిట్లు కొల్పాయి. వళ్లు ఝల్లుమంది. ఏవో భావాలు, ఏవో సువాసనలు మనస్సులో గుప్పుమన్నాయి. ఆ మాటనే పదేపదే ఉచ్చరించుకొన్నాడు:

"గృహిణి!"

దూరంగా గాజుల గలగల వినిపించి వెనక్కి చప్పున తలతిప్పి చూశాడు. ఒక లతాంగి వయ్యారంగా తన వేపు వస్తోంది; తనకోసం వచ్చేవాళ్లెవరుంటారులే—తల తిప్పుకొన్నాడు!

"వాసూ!"

ఉలిక్కిపడాడు. స్త్రీకంఠంనించి యింతమధురంగా ధ్వనించే తన పేరు—తనది కాదు, మరొకరిది కావచ్చు.

"వాసుదేవరావ్!"

ఆవిడ చాలాదగ్గరగా వచ్చింది.

"ఎవరు?" అన్నాడు సాహసించి.

ఆవిడ ఒక్క నిశ్వాసం విడిచింది తృప్తిగా!

"హమ్మయ్య బ్రతికాను! నువ్వు విశాఖపట్నంలో వున్నట్టు తెలుసుగాని, ఎక్కడున్నావో తెలీక రెండువారాలై యిక్కడికి వచ్చినా, నీ జాడ తెలుసుకోలేక చస్తున్నా"

వాసు ఆశ్చర్యానికి అంతులేకపోయింది. స్త్రీ, పై పెచ్చు ఏకవచన సంబోధన—పొరపడిందేమో!

"మీరు ఎవరో..." అంటూ నసిగాడు.

"మీరు!'—అప్పుడే మరచిపోయావా?"

ఎగాదిగా చూశాడు. జ్ఞాపకం రాలేదు!

"అవును యెలా వస్తుంది! నువ్వు రచయితవుగాబట్టి మాకు నువ్వు యెప్పుడూ జ్ఞాపకం వుంటావ్! కాని మాలో యేం ఘనతలున్నాయి గనక నీకు జ్ఞాపకముండడానికి!"

ఎంత ఆలోచించినా ఆవిడ యెవరో జ్ఞాపకం రావటంలేదు! తనకి ఊహ తెలిసినదగ్గరనించి ఆడవాళ్ళతో కనీసం మాటాడైనా ఎరగడు. అలాంటిది ఈ అమ్మాయి అంత ధైర్యంగా ఎంతో పరిచయమున్నట్టు మాటాడేస్తుంటె ఆశ్చర్యమే మరి!

"జ్ఞాపకంరాలే?" అంటూ రాగాలు తీస్తూ!" విజయవాడ— సీతారామయ్యగారు — వర్షంలో— కాలవల్లో—పడవలాట—" పకపక నవ్వింది.

మరుపు మసితల్పి పెళ్లగించుకొంటూ ఒక స్మృతి వెలికివచ్చింది. ముఖం యింతయింది—చప్పున నిలబడిపోయి—

"శ....శఁ....శా....శారదవా నువ్వు?" అన్నాడు విచిత్రానుభూతిలో సగం మాటలు మింగేస్తూ.

శారద అవునన్నట్టు చిరునవ్వు నవ్వింది.

'అబ్బ! ఎంతగా మారిపోయావ్! చప్పున గుర్తుపట్టలేకపోయాను సుమా!" పది పన్నెండేళ్ళవుతుందిగా నేను విజయవాడ విడిచిపెట్టి?'

"అంతలోనే మరచిపోయావ్! మరి మొన్న నీ కథలో 'ఆడవాళ్ళ కంత జ్ఞాపకశక్తెక్కడుందిలే' అన్న ఎత్తిపొడుపు శుద్ధ అబద్ధమేనా?"

"అందరూ అని నేననలేదే!—ఆఁ మీ నాన్నగారు, అంతా క్షేమమేగా?"

"ఈమధ్యే నాన్నగారు పోయారు. అన్నయ్యను విశాఖపట్నం బదిలీచేశారు. అతనితోబాటు మా మకాం గూడా మారింది."

"జగన్నాథరావా—ఎక్కడున్నాడు?"

"కాలేజీలో—నువ్వూ హఠాత్తుగా కనిపించావ్: అదృష్టం; రేపు నా పుట్టినరోజు పండుగ—నువ్వు తప్పక రావాలి—ఇదుగో అడ్రసు."

వాసు అడ్రసు కాగితం తీసుకొన్నాడు.

"ఈమధ్య పత్రికల్లో నీ దర్శనం లేదేం ఎక్కడా?"

ఈ ప్రశ్న నిజానికి వాసుని చాల బాధించింది. కాని పైకి నవ్వేస్తూ—

"పత్రికల నన్నిటినీ నేనే గుత్తకు తీసుకుంటే నీలాంటి కొత్తవాళ్లకి అవకాశం దొరికేదెలా?" అన్నాడు.

శారద నవ్వింది!

"నీ దయవల్ల నేనింకా రచయిత్రిని కాలేదులే; కాను కూడా. మా లెక్చరర్ ఒకాయన వున్నార్లే-ఆయనా యింగ్లీషులో కథలు రాస్తూవుంటారు—నన్ను రోజూ చంపుకతింటుంటారు—"

"ఎందుకు?"

"రచనలు చెయ్యమని, మా అన్నయ్య అంటాడు! నా జీవితాశయం ఫకీరిజం అయినా ఒప్పుకొంటాడటగాని, జర్నలిజం అయితేమాత్రం ఛస్తే సమ్మతించడట."

"అవును తెలుగురచయితల స్థితి నిజానికి అలానే వుంది. ఆ - అయితే - మీ లెక్చరర్ ఎవరు?"

"ఓ—చెప్పటం మరిచేపోయాను. నేను బియ్యే ఫైనలియర్ చదువుతున్నాను కాలేజీలో. అయినా ఈమధ్యనే రాజమండ్రినించి వచ్చారట. అన్నయ్యకు స్నేహితుడు. మాంచి కబుర్లపోగు కూడా నీలా."

వాసు సన్నగా నవ్వాడు: "అదంతా చిన్నతనంలోనేలే."

"ఇప్పుడెంతో మహా ముసలివాడవైనట్టు!"

ఇద్దరూ నవ్వుకున్నారు.

"సరె యిప్పుడొకసారి మాయింటికి వస్తావా?"

"ఇప్పుడా?" గుండెల్లో రాయిపడ్డట్టయింది.

"ఆఁ—ఏం?"

"కాస్త పనుంది."

"ఓస్! సంసారముంటే మరింత కనిపించవులాగుంది."

"అది కాదు శారదా, రేపు తప్పక వస్తాగా-ఇంకా ఆఫీసునుంచి యింటికి వెళ్ళలేదు."

"ఆఫీస్! ఉద్యోగం చేస్తున్నావా?"

"ఆఁ"

"నాకు తెలీదుసుమా! యూనివర్సిటీలో చదువుతూవుంటా వనుకొన్నాను."

"ఆఁ చదువుతున్నాగా యూనివర్సలో."

"అయితే ఎంతవరకు వచ్చింది బండి?"

"పోనిస్తూ అవన్నీ ఎందుకు—వస్తా మరి."

"రేపు తప్పకరావాలి."

"ఓ...వస్తా"

దూరంగా వెళ్లిపోయాడు! నడుస్తున్నాడు—మనస్సు మనస్సులో లేదు! తనలో ఒక్కసారిగా శారద కలిగించిన మార్పేమిటో అర్థం కాలేదు. తన ప్రతీ అణువులోనూ జీవశక్తి తలెత్తి ఎందుకో బ్రతుకు మీద మమత ఏర్పడింది. ఇంతవరకు తనలో ఏ అనుభూతీ యివ్వనటువంటి చిత్రవిచిత్రమయిన పరవశత్వాన్ని కలిగించింది శారద రూపు. ఎంత తియ్యగా మాటాడింది! ఆడవాళ్ళు యింత అందంగా, చల్లగా, మధురంగా మాటాడగలరని వాసుకి తెలీదు. వాళ్ళ మాటలు తన మనస్సులో వసంతాలను వర్షింపజేస్తాయనీ తెలీదు.

శారద చాల అందకత్తె.

ఆ అందంలో తనకేదో ఆశ కనిపించింది. పెనుతుఫానులో కలవరపడిపోతున్న సరంగుకి ఆ అందంలో ఏదో వెలుగు ముందు దారిని చూపించింది. తెల్లటి పాలవెల్లిలాంటి బాట ముందు కనిపించింది. తను నడవాలి; నడుస్తాడు; ఆనందంతో పరుగెత్తాలి; పరుగెత్తుతాడు త్వరగా, త్వరత్వరగా...

గిలిగింతలు కలిగించిన భావోద్వేగం నడకలో ప్రతిఫలించింది! క్షణంలో యిల్లు దగ్గరకి వచ్చేసింది. ఉత్సాహంతో ఉరకలు వేస్తున్న మనస్సులోని మధురానుభూతిని విజిలు వేసుకొంటూ వ్యక్తపరుస్తున్నాడు!

వాకిట్లో నే పిన్ని యెదురయింది!

"నా నాయనే! ఈవాళ కాస్త పెందరాళే రమ్మన్నందుకా దీపాలు పెట్టాక దిగబడ్డావ్!"

పిన్ని మాటలు సరిగా వినిపించుకోలేదు వాసు.

"అది కాదు పిన్నీ; విజయవాడనించి సీతారామయ్యగారి కుటుంబం వచ్చింది; వాళ్ళతో మాటాడుకొంటూ—"

పిన్ని కివన్నీ అనవసరం—

"వచ్చారూ! నాకు తెలుసు: ఏదో ఒకవంక కల్పించుకొని గాని తిరిగిరావని"

"వంక కాదు పిన్నీ—" మాటలు నోట్లో వుండగానే పిన్ని అడ్డి—

"వివరాలు తర్వాత చెబుదువు గాని కాస్త యింట్లో కనిపెట్టుకొని వుండు. నేను లక్ష్మమ్మగారింటికి సత్యనారాయణ వ్రతం చూట్టానికి వెడుతున్నా—జాగ్రత్త" అని వెళ్ళిపోయింది.

వాసు కీ మాట ఒక్కటీ సరిగా చెవి సోకలేదు. తన ఆనందంలో పిన్ని, పిన్ని మాటలు, ఆ యిల్లు, ఆ పరిసరాలు ఏవీ సరిగా అగుపించలేదు—తనలో తానే మురిసిపోతూ కూనిరాగాలు తీస్తూ కూచున్నాడు వాకిట్లో నే!

రాము వచ్చాడు.

"ఏవిట్రోయ్! మాంఛి హుషారుగా ఈలేస్తున్నావ్—యింట్లో మీ పిన్ని లేదా?" అనుకొంటూ.

మహదానందంతో లేచి నిలబడ్డాడు వాసు:

"రారారా! ఇక మన జీవితమంతా ఇంతే ననుకో!"

రాము ఆశ్చర్యపోతూ అడిగాడు:

"అద్భుతం! కొంపతీసి మీ పిన్నీ, బాబాయ్ బాల్చీ తన్నెయ్యలేదు కదా?"

"ఛ ఛ"

"మరి ?"

"పన్నెండేళ్ల తర్వాత తిరిగి కలసుకొన్నాను"

"ఎవరిని"

"శారదని"

"శారదెవ్రోయ్?"

"అప్పట్లో విజయవాడలో మా పొరిగింట్లో వుండేవారు. నన్ను చూసి తనే మొదట ఆనవాలు కట్టగలిగింది. పలకరించింది గూడా! తెల్లపోయాననుకో—ఎవ్రరా ఈ సినిమానటి నన్ను పలకరించేస్తోందని విభ్రాంతి పడిపోయాననుకో.

"ఒహ్హో! నీ మనోసీమలో సినిమాతారలు గూడా నాట్యం చేస్తున్నారన్నమాట!"

"కాదు—పోలిక చెబుతున్నా. అంత అందంగా, విలాసంగా, ఠీవిగా మాటాడుతూవుంటే ఏవిఁటో నన్ను నేను మరచిపోయాను! నా పాతికేళ్ల విరక్తి జీవితంలోను వేణుగానాలు ఒక్కసారిగా వినిపించి, నిరాశల్లో స్వర్గాన్ని సృష్టించాయి! ఆ దడబిడలో మాటలు సరిగ్గా దొరక్కపోయినా పరవశత్వం నాచేత ఏవిఁటో మాటాడించేసింది!

రాము వెటకారంగా "ఓహో!" అన్నా వినిపించుకొనే స్థితిలో లేడు వాసు.

"రేపు తన పుట్టినరోజు పండుగట" అన్నాడు.

"అంటే ?"

"నన్ను ఆహ్వానించింది. మరి బహుమతి ఏమివ్వాలో కాస్త ఆలోచిద్దూ"

రాము ఆలోచించి కొన్ని పుస్తకాలు కొని బహూకరించమన్నాడు.

"ఛా! అది బావుండదు...ఓ నెక్లేసో, డైమండ్ రింగో, టాయ్‌లెట్ సెట్టో—"

"ఉఁ ఇంకా?—నీలాంటి వాళ్ళకు వుండడానికి అండవుండదుగాని బ్రహ్మాండాన్ని మింగేద్దామన్నట్టు మాటాడుతారు. అయితే యింతకీ ఆ అమ్మాయి అంతస్థు గురించి ఏమైనా ఆలోచించావా?"

వాసు కాస్త నిరుత్సాహపడ్డాడు.

"ఏముంది? మనలాంటి మధ్య తరగతివాళ్లే, పెళ్లికాలేదు, బియ్యే చదువుతోంది."

"ఇహ అక్కడితో ఆగి నీ అంతస్థు ఏమిటో చూసుకో."

"నాకేం? నేనూ—" అని ఏదో అనబోయి చప్పున ఆగిపోయి, మాట మార్చి "అయినా దీంట్లో యివన్నీ లెఖకురావు."

"దీంట్లో అంటె?"

వాసు నసిగాడు.

"అంటె... నేనా అమ్మాయిని ప్రేమిస్తున్నాను రాము."

రాము పకపక నవ్వాడు.

"తొలిమాపు ప్రణయమన్నమాట."

"తొలిమాపు కాదు. చిన్నతనంనించి మాకు స్నేహముంది. ఈ నా నిరాశాజీవితంలో ఓ వెలుతురులా అగుపించింది శారద."

"కవిత్వంలోకి దిగక నామాట సరిగా విను. బాల్యంలో స్నేహం యవ్వనంలో ప్రేమగా మారడానికి ఎన్నో పరిస్థితులు అనుకూలించాలి. నీకు ప్రతీక్షణం జీవితంమీద విరక్తి కలుగుతుండబట్టి, ఆ అమ్మాయిని చూడగానే అమాంతంగా మనస్సు మేల్కొంది. అయితే నీకోర్కె ఫలించి ఆ అమ్మాయిని పొందగలిగితే నాకంటె సంతోషించేవాడుండడు. కాని అది వ్యతిరేకమయిందా నువ్వు రెండు వేపులనుంచి నిరాశతో సర్వనాశనమై పోతావ్—" అన్నాడు రాము ఒక జీవితసత్యాన్ని వెల్లడిచేస్తూ.

వాసు దీర్ఘంగా నిట్టూర్పు విడిచాడు.

"సరె, రేపు ఆఫీసునించి వాళ్లింటికి వెడదాం వస్తావా?"

రాము తలవూపాడు.

"మహాప్రసాదం...వదినగారిని చూసే అదృష్టం కలుగుతుందిగా ఈ దీనుడికి" అని వెళ్ళిపోయాడు.

వాసు అలానే వుండిపోయాడు!

మర్నాడు ఆఫీసునించి తిన్నగా శారద యింటికి వెళ్ళాడు. ఇల్లు కనుక్కోవడంలో అంత శ్రమపడ లేదు; కాని ఆ భవంతిని చూశాక శారద అంతస్తుని అందనా కట్టలేక నానా శ్రమా పడ్డాడు.

బయట గేటుదాటి లోపలికి ప్రవేశించేసరికి ఎదురుగా భవంతికి తీసుకుపోయే సిమెంటురోడ్డు; రోడ్డుకి రెండుప్రక్కలా పూలచెట్లు; కుడిచేతివేపు వున్న విశాలమైన మైదానంలో ఐదారు కార్లు వున్నాయి. క్షణంసేపు ఆ విచిత్ర ప్రపంచాన్నంతనీ కలియచూసి చాల భయపడ్డాడు. వెనక్కి వెళ్ళిపోవాలనుకొన్నాడు!

శారద జ్ఞాకానికి వచ్చింది.

ఆమె యింత ధనవంతురాలని తను కలలోనైనా వూహించలేదు! అయినా ఒకటే ఆశ్చర్యం! ఇంత కులీనురాలు తనలాంటివాణ్ణి తనకి తానుగా వెతుక్కొంటూ వచ్చి ఎందుకు పలకరించినట్టు! తనలో ఏదో గొప్పతనం వుండివుండొచ్చు. కేవలం తన రచనలని చూసి అంత ఆప్యాయత చూపిస్తుందంటే నమ్మ లేకండా వున్నాడు!

అయితే శారద—

గుండె ఆగినంత పనయింది. శారద తనని ప్రేమిస్తోందా! వంట్లో రక్తనాళాలన్నీ బ్రద్దలయ్యే స్థితికి పొంగిపోయాయి.

ఒకవేళ అలా అయితే గియితే ఆమెను తను భరించగలడా! శారద తన దారిద్ర్యాన్నీ, పేదరికాన్నీ చూసి ఈసడించుకోదూ? అసహ్యించుకోదూ? ఛఛ! శారద అలాంటిది కాదు.

అనుకొంటూనే లోపలికి వచ్చేశాడు.

కళ్లు జిగేల్‌మన్నాయి పెద్దహాల్లో ఆ అలంకరణ చూసీ, ఆ అతిథుల్ని చూసీ, వాళ్ళ మధ్య తన ఉనికిని ఊహించుకొనీ నిలువెల్లా కంపించిపోయాడు! ఒకమూలనించి వినిపిస్తున్న సంగీతం శరీరంలో జీవకణాల్ని ఉద్రేకోత్సాహాలతో పిచ్చెక్కించి, మత్తెక్కిస్తోంది! కళ్ళముందు శారదరూపు నృత్యంచేస్తున్నట్టగుపించింది. ఎంతగా సిగ్గుపడిపోవాలో అంతగానూ పడ్డాడు! తన శరీరం వేపు చూసుకొన్నాడు: ఖరీదైన దుస్తులు కావవి.' నెల కింత తెచ్చుకొంటున్నా ఒక సిల్కుజత బట్టలు కుట్టించుకొనే తాహతు లేని అస్వతంత్రుడు!...

అంతలో పక్కన సన్నని హృద్యమైన మాటలు వినబడ్డాయి.

"హల్లో! ఎట్టకేలకు మహాకవి 'వాసుశ్రీ'రంగం మీదికి వచ్చారు!"

తలెత్తి చూశాడు: శారద! గొంతుకలో నీళ్లూరాయి! రెండు జడలు, కంఠంలో గొలుసు, విలాసంగా చల్లగాలికి అల్లల్లాడే జార్జెట్ చీర, ముఖమల్ చెప్పులు—

"ఏం మహాశయా యింతాలస్యం?"

ఉలిక్కిపడి...చిన్ననవ్వు నవ్వేశాడు:

"ఆలస్యమయిపోయింది—క్షమించాలి"

"అల్పులం మహాకవి" తల వంచింది శారద, నవ్వుతూ. "సరె, బయటే నిలబడిపోతావా, లోపలికి రావడమేమైనా వుందా?"

వాసు లోపలికి వెళ్ళాడు. శారద చూపించిన సోఫాలో తడబడుతూ కూచున్నాడు.

"వాసు! వీరిని నీకు పరిచయం చేయడం మరిచా" అంటూ పక్కనున్న ఓ రాక్షసుణ్ణి, నిన్న సముద్రపొడ్డుదగ్గర పేర్కొన్న లెక్చరర్ గారుగా పరిచయం చేసింది.

నమస్కారాలు ప్రతి నమస్కారాలు అయాక లెక్చరర్ గారు అన్నారు:

"అవును మీ కథలు చాలా చదివాను" అని.

ఈ సమయంలో తన గొప్పతనాన్ని వాళ్ళు గుర్తించడం, వెల్లడించడం గూడా వాసుకి చాల సిగ్గుని కలిగించింది ఎందుకో!

"ఆఁ—ఇహ అందరూ వచ్చినట్టేగా—కార్యక్రమం మొదలు పెడదాం" అంటూ శారద వెళ్ళిపోయింది.

వాసుకి అనిర్వచనీయమైన ఆనందంతో బాటు, అవ్యక్తమైన బాధగూడా కలుగుతోంది. పక్కన కూచున్న లెక్చరర్ ఏవేవో మాటాడించారు.

"ఈమధ్య మీరు వ్రాస్తున్న కథలు చాల బావుంటున్నాయి. కాని వ్యావహారిక భాషమూలాన చాలమంది పండితులు మెచ్చుకోలేక పోతున్నారు."

"అయినా భాషకంటె భావం ముఖ్యం కాదంటారా?"

"శారద భాషని భావాన్ని విడదీయగూడదంటుంది."

వీటన్నిటికీ వాసు ఒకేలాగున సమాధానమిచ్చాడు.

"నిజమేలెండి" అంటూ.

హాల్లో అంతా ఒక్కసారి గొల్లుమని చప్పట్లు కొట్టారు. ఉలిక్కిపడి అటు చూశాడు. శారద అభివందనం చేసి వీణతీసింది...తీగలు కదిలాయి; కంపించాయి; ధ్వనించాయి! వాసు హృదయం లయకలిపింది. ఎంత హృద్యంగా పాడుతోంది!

శారద పాడుతున్నంతసేపు లెక్చరర్ గారు వాసుని ఏవేవో అడిగారు; కాని వాటికి సరైన సమాధానాలు యివ్వలేకపోయాడు. పాట పూర్తికాగానే లెక్చరర్ గారు లేచి శారద దగ్గరకు వెళ్ళారు.

వాసు కెందుకో భయం వేసింది; బాధ, కోపం గూడా కలిగాయి. శారదని తననించి ఎవరో దూరంగా తీసుకుపోతున్నట్టు వ్యథ చెందాడు. చిన్నతనం నుంచి తనకి తెలిసిన శారద ఈ లెక్చరర్ మీద యింత యిష్టంగా వుండటం తలచుకొంటే వళ్ళు జలదరించింది.

దూరంగా లెక్చరర్ శారదని పొగిడేస్తున్నాడు.

"అద్భుతం శారద! ఇంత అమోహంగా పాడగలవని అనుకోలేదు నే నెప్పుడూ"

శారద నవ్వింది:

"హాస్యం చేస్తున్నారా?"

"కలకంఠిని వెక్కిరించడమా?"

"అహఁ!"

"ఒక పాటపాడాలి"

"మీరు కోరడం, నేను తిరస్కరించడమూనా?"

తర్వాత వాళ్లు మాటాడుకొన్న మాటలు చాల అస్పష్టంగా వినిపించాయి.

శారద అంత ధైర్యంగా లెక్చరర్ ముందు మాటాడటం, నవ్వటం వాసుకి యెందుకో చాల బాధనిపించింది. తన చుట్టూ కూచున్న వాళ్ళంతా తన ఆరాటాన్ని కనిపెడుతున్నారేమోనని భయపడ్డాడు వెంటనే.

రాము కంగారుగా వచ్చాడు. ద్వారం దగ్గర అతన్ని చూసి లోపలికి పిలవడానికి మనస్కరించలేదు! క్షణంసేపు అతనికి కనిపించకూడదని ప్రయత్నం చేశాడు. అతను తన స్నేహితుడని వీళ్లకి తెలిస్తే ఏమనుకొంటారు? అసలు శారదకు వాణ్ణెలా పరిచయం చెయ్యాలి? ఏడిశాడు! పరిచయం చేసేంత గొప్పతనం వాడిలో ఏముందిలే! వాణ్ణి తన నౌకరుగా వూహించుకొని తృప్తిచెందబోయాడు... వెతుక్కుంటూ రాము వచ్చేశాడు.

"వాసూ!"

ఉలిక్కిపడ్డాడు వాసు.

"ఏమిఁటలా చూస్తావ్—నేనే."

వాసు సమాధానం చెప్పడంలో తడబడాడు. రాముని నౌకరుగా వుపయోగించుకొనే భావంతో, బాగా స్వరం తగ్గించి కీచి వుట్టిపడేటట్టు అడిగాడు:

"ఇ...ఇంతాలస్యంగా వొచ్చేవేం?"

"పాతిక రూపాయలకు ఎవడూ చెక్కేసు యివ్వలేదు; బజారంతా గాలించాను-దచ్చినంతే పనయిందంటే నమ్ము."

అంత గట్టిగా, అంత అసభ్యంగా వాడు మాటాడ్డం అసహ్యమనిపించింది వాసుకి. మిగతా అతిథులందరు తమవేపు అలగా జాతివాళ్ల వేపు చూసినట్టు చూస్తారేమో అని సిగ్గుతో చచ్చిపోయాడు. పోనీ—

"అలా బ్రూట్‌లా కేకలేస్తావేరా?" అనేపాటి ధైర్యంకూడా లేకపోయింది.

"అయితే ఏం తెచ్చావ్?" మరీ మెల్లగా అడిగాడు.

"కొన్ని పుస్తకాలు."

"ఏడిసినట్టుంది."

శారదపాట పూర్తి అయింది. హోరెగిరి పోయేట్టు చప్పట్లు, నవ్వులు, అభినందనలు—అంతా వాసుకి వింతగా కనిపించింది.

వెంటనే శారద వచ్చింది.

"హలో వాసూ...ఎలా వుంది పాట?"

సమాధానం చెప్పాలి. తన సమాధానంలో తన తక్కువతనం స్ఫురించకూడదు. ఆ మిగతా వాళ్లందరి కంటె తనే గొప్పవాడనే భావంతో మాటాడాలి.

అందుకే మాటకిముందు నవ్వేస్తూ—

"చాల గొప్పగా వుంది" అన్నాడు. ఇంకా ఏవేవో విశేషణాలు చేర్చాలనుకొని చేర్చలేకపోయాడు. ఆ లోపాన్ని కప్పుకోడానికి, చప్పున చేతిలో ప్యాకెట్ ఆమెకు అందించాడు—పక్కనున్న రాము ఆమె అందానికి దిగ్భ్రాంతి చెంది, అలాంటి సౌందర్యరాశి తన స్నేహితురాలని ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరైపోతూ వుండాలనే అంతరార్భవంతో!

"ఇదేమిటి?" అంది శారద ఇటూ అటూ ఆ ప్యాకెట్ తిప్పుతూ.

"బహుమతి"

"ఓ" అంటూ నవ్వింది.

ఆ కిలకిలకి రాము చచ్చిపోయుంటాడు!

"నువ్వు కవివి గాబట్టి కవిత్వాన్ని మోసుకొచ్చావ్" అంది.

నిజానికి శారద ఆ మాటని మరోభావంతో అని వుండదు కాని, వాసుమాత్రం చాల సిగ్గుపడ్డాడు, 'ఓస్! పుస్తకాలటోయ్ బహుమతి చేసేదీ' అని ఆవిడ వ్యంగ్యంగా వెక్కిరించిందనే భావాన్ని దాన్లోనించి తీసుకొని.

"సరేగాని, పైవారం సింహాచలం పిక్నిక్‌కి వెడుతున్నాం, వస్తావా?" అంది.

"నేనా?"

"అవును నువ్వే"

"వీలుపడదు"

"ఎందుకో"

ఎందుకో మరి! నసిగాడు. పిక్నిక్! వూహించుకొంటే చాల గొప్పగానే వుంది. కాని అక్కడికి ఇలాంటివాళ్లతో వెళ్లడం మామూలు సంగతా?

"వీలుపడదు శారదా"

"నీ కెప్పుడూ వీలుపడదు—ఎందుకో మరి?"

సమాధానంనించి తప్పించుకోవాలి. ఇటూ అటూ చూసి లేచి—

"ఇహ వేం వస్తాం" అన్నాడు.

"ఇంత తొందరా?"

"కాస్త పనుంది...లెక్చరర్ గారి ఇంటికి?"

"పిలవమంటావా?"

"వద్దులే...వస్తే వెళ్ళిపోయినట్టు చెప్పు."

బయటకు వెళ్ళిపోయాడు.

దార్లో రాము అన్నాడు:

"గగన కుసుమ మనుకొంటానురా వాసూ"

నిట్టూర్పు విడిచాడు.

"ఈ లెక్చరర్ ఎవరు?" కనీసం లెక్చరర్‌నైనా చూడని రాము నిజానికి ఏదో సమాధానం చెబుతాడని కాదు అడిగింది, మనస్సులో ఈర్ష్య, అసూయ, బరువు, భారం తగ్గిపోయేటందుకు అడిగాడు.

"ఎవరైనా కావచ్చు; కాని శారదమీద ఆశ పెట్టుకోవద్దని నా సలహా" అన్నాడు రాము.

"సలహా!" నవ్వుకున్నాడు.

వారందినాల తర్వాత ఓనాడు ఒంటరిగా సముద్రపొడ్డు ఇసికలో కూచొని రెండు నీలాంబుదాలను పరీక్షగా చూస్తున్నాడు వాసు!

అనంతంలో కలసుకొన్న ట్లున్పిస్తున్న రెండు నీలాంబుదాలూ నిజానికి అక్కడ ఆలింగనం చేసుకొంటున్నవా? ఏమో—మాయ!—వేదాంతం కలగదు మనిషికి?

తన ఉనికిని జ్ఞప్తికి తెచ్చుకున్నాడు: చలనం లేని తన అస్తిత్వానికి దుఃఖించాడు. పాతికేళ్ళు మీద వచ్చిపడ్డాయి; ఇంకా తను ఆలోచిస్తూనే వున్నాడు — తన గురించి, తన జీవితం గురించి. ఏ ఒక్క నిర్ణయమూ చేసుకోలేదు; కచ్చితంగా అటో యిటో తేల్చుకొనే ధైర్యమూ లేదు!

ఈ వారం దినాల్లో ఏదో ఒక మధురానుభూతి తన హృదయంలో నిర్విరామంగా నృత్యం చేసింది. ఆ ఆనందంలో తనకి నిరాశలు, ఖేదాలు, కన్నీళ్ళు అగుపించలేదు. ఒకవేళ వున్నా అవి తనని అంతగా బాధించలేదు. ఆ క్షణాల్లో జీవితం పరమ పూజ్యంగా కనిపించింది: ఆ డిన్నర్లు, ఆ టీపార్టీలు, ఆ పిక్నిక్‌లు, ఆ నవ్వులు, ఆ మాటలు, ఆ నడవడి తనలో ఏవో ఏవో ఆశల్ని రేకెత్తించి చిత్రంగా ఉల్లాసపరిచేవి. పిన్ని మూతి విరుపులు పూలమాలల్లా వుండేవి, బాబాయ్ తిట్లు సంపెంగ పరిమళాల్లా దగ్గరకు చేరేవి. నిరాశల్లో ఆశాసౌధాలు నిర్మింపబడేవి తమాషాగా!

కాని—

నిన్న!

తను వెళ్ళాడు: శారదను చూడాలని. మేడ మీద అగుపించింది: రెండు జడల్లో ఏనాడూ కనిపించనంత సౌందర్యంగా కనిపించింది.

"శారదా!" లోలోన ఉచ్చరించుకొన్నాడు! చప్పున మెట్లు యెక్కాడు. మాటలు వినిపిస్తున్నాయి: అక్కడే ఆగిపోయాడు.

"శారదా" ఒక కంఠం దగ్గరగా వచ్చింది!

"ఇదేమిటి—హద్దుమీరి నడిచేస్తున్నారు? వారం రోజుల్లో పెళ్ళిపెట్టుకొని యిలా అత్తారిళ్లకి రావచ్చా?" శారద గొంతు.

"సరేగాని రేపు నేను మద్రాసు వెడుతున్నా"- ఈ స్వరం లెక్చరర్‌దని వాసు గుర్తుపట్టగలిగాడు.

"ఎందుకు?"

"కొన్ని వస్తువులు తీసుకరావాలి."

"బాగుంది అంత అవసరమైతే ఎవరినైనా పంపించకూడదు?"

లెక్చరర్ నవ్వారు:

"భయం లేదులే — ముహూర్తానికి సరిగా వస్తాలే."

లెక్చరర్ వెళ్ళిపోయాడు.

శారద కూనిరాగం మొదలుపెడుతుంది.

పెళ్ళి! ఎవరికి? శారదకు... లెక్...

గుండె ఆగినంత పనయింది! క్షణంసేపు తను ఎక్కడున్నదీ తెలుసుకోలేనంతగా కళ్లు మిరుమిట్లు గొల్పాయి. తేరుకొనేసరికి తను అప్రయత్నంగా మెట్లు దిగి, గేటు బయటకు వెళ్ళిపోయాడు.

ఆరాత్రి తను ఏం చేస్తున్నదీ, చెయ్యవలసిందీ తెలిసికోలేకపోయాడు. ఆ మర్నాడు ఆఫీసులో ఎలా పనిచేశాడో తెలీదు. సాయంకాలం చేతికి వచ్చిన జీతాన్ని గూడా లెఖ్ఖపెట్టుకోకండా తిన్నగా సముద్రపొడ్డుకు వచ్చాడు.

సముద్ర తరంగాలు పక్కవాళ్లకు ఆనందాన్నిస్తాయి. కాని తనలోని తరంగాలు తననే ముంగు సర్వనాశనం చేస్తున్నాయి. తిరిగి జీవించాలనే వాంఛ ఉధృతమై తిరిగి కుప్పలా కూలిపోయింది! తనిప్పుడేం చెయ్యాలి?

బాగా చీకటిపడిన తర్వాత ఎటూ నిశ్చయించుకోలేని స్థితిలో యింటికి వచ్చాడు.

బాబాయ్ గొంతుక వినిపించింది:

"ఓయ్! నిన్నే! వాసు క్రితం నెల జీతం యిచ్చాడా అని అడుగుతున్నా."

"నన్నెందుకు కడగడం—మొత్తం అంతా కలిపి యిమ్మన్నారుగా? ఇస్తాడో, చస్తాడో అదంతా మీ పూచీ."

నిర్లక్ష్యంగా వాసు యింట్లోకివచ్చి, జీతాన్ని తీసి బాబాయ్ చేతిలో పెట్టాడు.

"ఏమిటిది?" అన్నాడు బాబాయ్.

"ఈ నెలజీతం"

"ఎంత?"

"నాకు తెలీదు"

బాబాయ్ లెక్కపెట్టుకున్నాడు.

"ఊఁ, క్రితం నెలది?"

రెండో జేబునించి ఇరవై తీసియిచ్చాడు. అదీ బాబాయ్ లెక్కపెట్టుకొని అడిగాడు:

"తతిమా నలభై ఏవి?"

"ఖర్చయిపోయింది బాబాయ్"

"ఎలా?"

"ఆమధ్య సింహాచలం స్నేహితులతో కలిసి వెళ్ళాను."

పిన్ని అందుకుంది:

"ఊహూఁ! తాగడానికింత లేదుగాని స్నేహితులతో షికార్లట గూడానూ—"

"నిజమే పిన్నీ" అన్నాడు నిట్టూర్పు విడుస్తూ. "తాగడానికి గంజిలేనివాడు సంతోషాలకోసం పైకి యెగరకూడదు."

"ఓ యబ్బో! మాటకిమాట యెదురాడ్డంకూడా నేర్చాడే! అదే ఏదో సామెత చెప్పినట్టు: ఆరునెల్లు అంట్లూ మెతుకులు తినేసరికి ఆంబోతు రంకె లేసిందట!"

వాసు చాలా తమాయించుకొన్నాడు:

"ఇకనలా రంకెలు వేయనులే పిన్నీ: నా బ్రతుకు నేను చూసుకొంటాను"

బాబాయ్‌కి చిర్రెత్తుకొచ్చింది:

"ఏమిట్రోయ్ నీ బ్రతుకు నువ్వు చూసుకొనేది? ఇన్నేళ్ళుగా నా సొమ్ము తిని నా రొమ్మే గుద్దడానికి ప్రయత్నిస్తున్నావ్!"

"అంత కృతఘ్నుణ్ణి కాను బాబాయ్. నేను మిమ్మల్నేం అనను. అమ్మా నాన్నా పోయాక ఇంతవరకు గాలిలో దీపం బ్రతుకు బ్రతికాను. ఇకనించయినా స్వేచ్ఛపొందాలని రెక్కలాడిస్తున్నాను—అడ్డగించకండి బాబాయ్"

"అవున్లే అది లోకసహజమేలే" అందుకొంది పిన్ని "ఎక్కడలేని దిక్కుమాలినవాళ్ళనీ ఈ కొంపకి తెచ్చి పోషించి, చివరికి యిలాంటి మాట లనిపించుకోడానికే అని నేను నెత్తీ నోరూ బాదుకున్నా ఆనాడు వినిపించుకోనందుకు, మామంచి బాగా చెప్పుతో కొట్టావు నాయనా"

"అంత కంగారుపడకు పిన్నీ—" వాసు మాటలు నోట్లోనించి పూర్తిగా రాకండానే బాబాయ్ ఉద్రేకంతో "కంగా రేమిట్రా వెధవా" అని ఛెళ్లున దవడమీద కొట్టి బయటకు గెంటేశాడు.

వాసు కళ్ళనించి నీళ్లు గిర్రున తిరిగాయి. కోపాన్నీ, దుఃఖాన్నీ నిగ్రహించుకొంటూ:

"వస్తా పిన్నీ—వెళ్ళొస్తా బాబాయ్"అని వెళ్లిపోయాడు బయటకు!

గాలిలో దీపం నిశ్చలంగా నిలబడింది—వడగాలికి తట్టుకొని. చమురు పూర్తిగా ఆహుతయిన తర్వాత అంత్యంలో కలిగే నిశ్చలత యేమో అది!

తిన్నగా రాము యింటికి వెళ్ళాడు—సముద్రంలో పడి ఆత్మహత్య చేసుకోవాలనే భావంతో. తలుపు తట్టాడు. రాము ఆశ్చర్యపోతూ వాసుని లోపలికి తీసుకవెళ్ళి పడక కుర్చీలో కూచోబెట్టాడు.

ఆ వాలకం అర్థంకాక రెండు మూడుసార్లు అడిగాడు "ఏమయిం"దని. సమాధానం లేక విసుగెత్తిపోయాడు రాము!

అరగంట తర్వాత వాసు రెండేమాటలు పేల్చాడు:

"శారద వెళ్ళిపోయింది—నా ఆశలు తిరిగి కూలిపోయాయి"

రాము భయపడ్డాడు. అయినా ధైర్యం చెప్పే ధోరణిలో—

"చాల గొప్పవాడివే గాని, యిక్కడ కాసేపు విశ్రాంతి తీసుకో, నే నిప్పుడే వస్తా"

"ఎక్కడికి వెడతావ్?"

"నీకెందుకు—కాస్త పడుకోందూ."

తలుపు దగ్గరగా చారేసి రాము బయటకు వెళ్లిపోయాడు.

చాలసేపు వాసు పడకకుర్చీలో పడుకున్నాడు. కళ్ళు మూతలు పడవు! మస్తిష్కంలో తుఫాను: అందులో శారద మెరిసి అస్పష్టంగా అదృశ్యమై పోతోంది.

చప్పున రొప్పుతూ లేచాడు. కలంతీసి రాశాడు. నుదుటమీది బిందువులు సిరామీద రాలాయి. వాసు చూసుకోలేదు. సంతకంచేసి, తలుపుతీసి వెళ్ళిపోయాడు.

పావుగంటలో రాము వచ్చాడు, శారదతో కలసి.

శారద కంగారుగా "వాసు ఏడీ?" అంది.

రాము లోపలికొచ్చి చూశాడు: ఖాళీ పడక కుర్చీ! పిలిచాడు—ప్రతిధ్వని తప్ప సమాధానం లేదు! అరచాడు; గది కంపించి భయంతో ఆ కేకని రెట్టించింది—వెళ్ళిపోతున్న వాసుకి వినిపిస్తుందో వినిపించదో అని.

దీపం వెలుతుర్లో కాగితం కనిపించి చప్పున ఎత్తి చదివాడు. పూర్తికాకుండానే "వాసూ" అని అరచుకొంటూ సముద్రం వేపు పరుగుతీశాడు రామూ—"ఆగండి నేనూ వస్తున్నా" అన్న శారద మాటలనైనా వినిపించుకోకండా!